ఆర్‌యూవీఎస్‌ను ఈడబ్ల్యూఎస్ అర్హులకు అమలు చేయాలి

చిక్కడపల్లి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాస్ పథకం (ఆర్‌యూవీఎస్)లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అర్హులైన యువతకు అవకాశం కల్పించాలని తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారికి వినతిపత్రం అందజేశామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ఆర్థిక స్థితిగతుల ఆధారంగా అమలు చేయాలన్నారు.

ఆహ్వానం



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాలనీ ప్రతినిధులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 6వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకకు హాజరుకావాలని ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డికి కాలనీవాసులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి మహేష్ గుప్తా, కోశాధికారి రఘుపతిరెడ్డి, నాయకులు వెంకట్, రామ్మోహన్ నాయుడు, శ్యామ్‌లాల్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని విజయశ్రీ కాలనీ పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ప్రాభోధికం, ఉత్సవాంగ స్నపనం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, శాంతిహోమం నిర్వహించారు. ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీర్క నర్సిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జోన్నాడ మోహన్‌రెడ్డి, కార్యదర్శి మార్గం రాజేష్, సత్యనారాయణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

విలు విద్యలో హాస్యకు బంగారు పతకం



బంగారు పతకంతో హాస్య

హయత్‌నగర్: ఏపీ గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ ఎన్‌టీపీసీ జాతీయ ఆర్చరీ(విలు విద్య)చాంపియన్‌షిప్ పోటీలలో హయత్‌నగర్‌కు చెందిన మామిడిపల్లి హాస్య తెలంగాణ రాష్ట్రానికి బంగారు పతకాన్ని సాధించారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న హాస్య అండర్ 13 బాలికల విభాగంలో ఆర్చరీ పోటీలలో తెలంగాణ తరుపున పాల్గొన్నారు. గతేడాది జరిగిన ఐసీఎస్‌ఈ జాతీయ పోటీలలోనూ బంగారు పతకం సాధించినట్లు హాస్య తల్లిదండ్రులు తెలిపారు.

వెల్‌నెస్ క్యాంప్



మన్సూరాబాద్‌లోని వెల్‌నెస్ సెంటర్‌లో పేరు నమోదు చేసుకుంటున్న ప్రజలు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని ఎస్కే గార్డెన్స్ సమీపంలోని వైద్యాలయ స్పెషాలిటీ క్లినిక్స్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన, వెల్‌నెస్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ క్యాంపులో డయాబిటిక్ టెస్ట్, బీపీ, ఒబేసిటి టెస్ట్, బీఎండీ పరీక్షలు నిర్వహించారు. డా. గౌతం గోరిట్యాల, డా. బిందుపావనీ, డా. సురేష్‌రెడ్డి, డా. కౌడిన్య ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు.

డేంజర్ పోల్స్..!

చంపాపేట డివిజన్‌లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



సాయిరాంనగర్ కాలనీ రోడ్ నెం 02లో కాలం చెల్లిన విద్యుత్ స్తంభం



సాయిరాంనగర్ కాలనీలో ఓపక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

ఎస్‌జీఆర్ కాలనీలో ఎత్తు తక్కువ తల భరువుతో కేబుల్ వైర్లతో విద్యుత్ స్తంభం



- పట్టించుకోని సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులు
- ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయపడుతున్న స్థానికులు

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ప్రతి పోల్‌కు వేలాడే విద్యుత్ తీగలు, సర్వీసు వైర్లు చేతులకు అందేంత ఎత్తులో వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. అది చాలదన్నట్లు ప్రతి విద్యుత్ స్తంభానికి పోల్స్ మోయలేనంత బరువుతో కేబుల్ వైర్ల చుట్టలు ఉరితాడులాగా మారుతున్నాయి.

☛ చంపాపేట డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్, ఎస్‌జీఆర్, కటకోనికుంట, నెహ్రూనగర్ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. గట్టిగా గాలివీస్తే చెట్ల మధ్యలో ఉన్న పోల్స్ ఊగడంతో వైర్లు ఒకదానితో ఒకటి పెనవేసుకుని మంటలు చేలరేగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరికొన్ని విద్యుత్ స్తంభాలు కేబుల్ వైర్ల బరువుతో ఓ పక్కకు ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

☛ సర్కిల్, ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలం చెల్లిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు.

స్తంభాలను తొలగించాలి



కాలనీలోని రోడ్ నం.01. 02. 03లోని విద్యుత్ స్తంభాలు భారీ వృక్షాల మధ్యనే ఉన్నాయి. గాలలు వీస్తే స్తంభాలు ఊగుతున్నాయి. మరికొన్ని ఓ పక్కకు ఒరిగి భయపెడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మేము భయం గుప్పిట్లో ఉండాల్సిందేనా.

– చందుయాదవ్, సాయిరాంనగర్

వేలాడే తీగలను సరిచేయాలి



అసలే దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన స్తంభాల ఎత్తు తగ్గిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయి. భయం గుప్పిట్లో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి మాకు దాపురించింది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించారు.

– శివగౌడ్, కర్మన్‌ఘాట్



భారీ వృక్షం సమీపంలో విద్యుత్ స్తంభం

చంపాపేటను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



కాలనీవాసులతో కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్‌లోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి చంపాపేటను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీవాసులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, గుంతలుగా మారిన రోడ్లు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... త్వరలో రూ.1.7కోట్లతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ విస్తరణ పనులు చేపడతామని అన్నారు. అంగన్‌వాడీ పాఠశాల స్థానంలో మహిళా భవనం, బస్తీ దవాఖానా భవనం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సునీల్, విశ్వనాథ్‌గౌడ్, శ్రీకాంత్, హన్మంతరెడ్డి, భార్గవ్‌చారి, నరేందర్, శ్రీధర్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదంపై హర్షం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: తెలంగాణలో బీసీల రిజర్వేషన్లను పెంచే బిల్లుకు అసెంబ్లీలో ఆమోద ముద్ర వేయడం హర్షణీయమని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఐఎస్‌సదన్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కోట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... బీసీలలోని అన్నివర్గాల వారికి ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, ఉపాధి రంగాలలో సమాన అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ నాయకులకు సముచిత స్థానం దక్కుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవిరాజు, కోట్ల లడ్డూ పటేల్, గన్ని, మల్లికార్జున్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభం



వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో ఆయుష్మాన్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

వనస్థలిపురం: వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధునాతన పరికరాలతో రిహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులు డా.జీవీకేఆర్.గౌడ్, డా.ఎం.రాజేందర్‌కుమార్, డా.బి.విజయ్ కుమార్, డా.కే.కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు సామ రంగారెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ముద్దగౌని రాంమోహన్‌గౌడ్, గంగుల కృష్ణారెడ్డి, నేలపాటి రామారావు, సత్యనారాయణ, అశోక్‌గౌడ్, శాలిని, నరసింహాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ తరగతులు షురూ



కరాటే శిక్షణ తీసుకునేందుకు వచ్చిన విద్యార్థులతో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ఆపద సమయంలో స్వయం రక్షణ కోసం కరాటే దోహదపడుతుందని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కృష్ణతులసి నగర్ కమ్యూనిటీ హాల్ గ్రౌండ్స్‌లో ఆదివారం కాలనీ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల, బాలికలకు ఉచిత కరాటే, సెల్ఫ్ డిఫెన్స్ ట్రైనింగ్ క్లాసులు కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామాక్షి పురం విద్యార్థుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. కాలనీకి చెందిన బాల, బాలికలు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న రంగాలలో పిల్లలకు తర్ఫీదు ఇప్పిస్తే ప్రయోజకులుగా ఎదడానికి వీలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ నవీన్, మాస్టర్ రాజుగౌడ్, సభ్యులు విశ్వనాథ్, కొంగర ప్రవీణ్, నగేష్, ఉమేష్ తదితరులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా జగన్‌యాదవ్



జగన్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

చైతన్యపురి: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన గండి జగన్ యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేసి నియామకు పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా గండి జగన్‌యాదవ్ మాట్లాడుతూ... బీసీ సంక్షేమానికి పాటుపడతానని అన్నారు. వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వాలు ఇస్తున్న పథకాలను అందరికి అందే విధంగా కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పసల కృష్ణభారతి మృతి

నాగోలు: స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందిన పసల కృష్ణ భారతి(92) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని ఆమె నివాసంలో కన్నుమూశారు. ఏపీలోని ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ స్వతంత్ర సమరయోధులు పసల కృష్ణమూర్తి అంజయ్యలక్ష్మి దంపతుల రెండో కుమార్తె కృష్ణ భారతి. జీవితాంతం గాంధేయ వాదిగా ఉంటూ గాంధీజీ ప్రవచించిన విలువలతోనే జీవించిన ఆమె పలు విద్యాసంస్థలకు నిధులు అందించడంతో పాటు దళితుల్లో విద్యా వ్యాప్తికి కృషి చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. 2022 జూలైలో భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కృష్ణ భారతిని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సత్కరించడంతో పాటు ఆమెకు పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. కృష్ణభారతి మరణం పట్ల పలువురు సంఘీభావ ప్రకటించారు. కృష్ణభారతి అంత్యక్రియలు ఆదివారం నాగోలు శ్మశానవాటికలో నిర్వహించారు.

అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు భాగస్వామ్యం కావాలి

చంపాపేట: కాలనీల అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు భాగస్వామ్యులు కావాలని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కర్మన్‌ఘాట్ పాతబస్తీలోని శ్రీభవానీ సమేత నాగలింగేశ్వరస్వామివారి ఆలయ ప్రవేశ ద్వారం (కమాన్)ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ఆయన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముడుపు రాజిరెడ్డి, సదానందరెడ్డి, వసంత్, రోజా, రమాదేవి, మల్లేష్‌గౌడ్, రవిముదిరాజ్, ఉమామహేశ్వర్, రాజు, శివగౌడ్, శ్రీనివాస్, నరేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఏడుగురి అరెస్టు

నాగోలు: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన నాగోలు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కో-ఆపరేటివ్ బ్యాంక్‌కాలనీ రోడ్‌నం.14లోని హెచ్‌ఆర్సీ భవనంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న స్థావరంపై పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. అక్కడ పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25,180 నగదు, 7 మొబైల్ ఫోన్లను స్వా.దీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాలని వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన హిమపురికాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధి హిమపురికాలనీ ఫేజ్–2లో రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... కాలనీలో రోడ్ల నిర్మాణం చేపట్టి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రాకాసి బుచ్చిరెడ్డి, సయ్యద్ గఫార్, వెంకట్‌రెడ్డి, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వే–బ్రిడ్జ్ నిర్వహణకు టెండర్లు పిలుస్తాం

ఆర్‌జేడీ మల్లేశం



నిరుపయోగంగా ఉన్న వే బ్రిడ్జ్

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వే–బ్రిడ్జ్ నిర్వహణకు టెండర్లు పిలిచి త్వరలో వినియోగంలోకి తెస్తామని హైదరాబాద్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ అధికారి ఈ.మల్లేశం స్పష్టం చేశారు. శనివారం మలక్‌పేట మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... వే–బ్రిడ్జ్ కొంత మేర చెడిపోయి ఉందన్నారు. దానికి మరమ్మతులు చేపట్టి టెండర్లు పిలుస్తామని తెలిపారు. రైతు విశ్రాంత గదులపై నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ నెల తర్వాత మార్కెట్‌లో పెండింగ్‌లో ఉన్న పనులకు శ్రీకారం చుడుతామని తెలిపారు. మార్కెట్ ఆదాయం గడువు కంటే ముందే రావటంలో అధికారుల కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎస్ దామోదర్, గ్రేడ్–1 నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌రింగ్ రోడ్డులో నివాళులర్పిస్తున్న డీవైఎఫ్‌ఐ నేతలు



భగత్‌సింగ్ సంస్మరణ సభలో పాల్గొన్న మాదాల రవి, ఉదయభాను



విప్లవ వీరుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

చైతన్యపురి: విప్లవ యువకిశోరాలు షహీద్ భగత్ సింగ్, రాజగురు సుఖ్‌దేవ్ వర్ధంతిని సరూర్‌నగర్ సీపీఎం సర్కిల్ ఆధ్వర్యంలో జరిగింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని బోడేపూడి వెంకటేశ్వర్లు స్మార్ట్ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు మల్లెపాక వీరయ్య ముఖ్యఅతిథిగా హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని అన్నారు. 23 ఏళ్ల వయస్సులోనే చిరునవ్వుతో ఉరికంభం ఎక్కారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ వెంకన్న, కట్ట శ్రీనివాస్, జి.మనోహర్, కడారి రాములు తదితరులు పాల్గొన్నారు.


విప్లవ వీరుల జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలి...

మన్సూరాబాద్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతినిఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ హయత్‌నగర్ మండల సమితి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్ రెడ్డి, బాలికల కన్వీనర్ కాటిశ్రావణి ముఖ్యఅతిథులుగా హాజరై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య విప్లవవీరులైన ఈ ముగ్గురి జయంతి, వర్ధంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారింగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు మర్రి శోభన్, ఈనపల్లి ఉపేందర్, వీరమల్ల శివ, భానుప్రకాష్, గాలెంక కాశీ, గంగరాజు, కృష్ణ, సాయి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగోజిగూడ: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ఆదివారం సాగర్‌రింగ్ రోడ్డులో డీవైఎఫ్‌ఐ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు నేతలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు పొట్టిపాక నితిన్, ఎల్లయ్య, దుర్గారావు, ప్రభాకర్, రామస్వామి, గోవిందు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఈ దేశం ఎప్పటికీ మరవదు

వనస్థలిపురం: దేశం కోసం ఉరికంబం ఎక్కిన అమరవీరులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఈ దేశం ఎప్పటికీ మరవదని, వారిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. సందర్భంగా మాభూమి సాహితి సాంస్కృతిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో విప్లవ వీరుల వర్ధంతిని ఆదివారం చింతలకుంటలోని వాసవీ శ్రీనిలయంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తలసేమియా పిల్లల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డా.మాదాల రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నటి, వ్యాఖ్యాత ఉదయభాను మాట్లాడుతూ... దేశంలో జరుగుతున్న అవినీతి, అత్యాచారాలు చూస్తుంటే ఇందుకా ఆ వీరులు ప్రాణత్యాగాలు చేసిందని అనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సీబీడీ ఏసీపీ మాధవీలత మాట్లాడుతూ... భగత్‌సింగ్ జీవితం ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అదనపు న్యాయమూర్తి కే.మురళీమోహన్, సంస్థ కన్వీనర్ గొర్రెపాటి నరసింహప్రసాద్, సభ్యులు ఉదయ్‌శంకర్, నాగిరెడ్డి, పద్మలత, శరణ్య, కేశవరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లోని బోడేపూడి వెంకటేశ్వర్లు స్మార్ట్ కేంద్రంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



హయత్‌నగర్‌లో విప్లవ వీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు